స్కెచ్

# "గోవా సత్యాగ్రహం"

లక్ష్మి

రేడియో కొనాలని మా తమ్ముడికి ఆదికాలం నుంచి ఒక కోర్కె ఉందికాని ఏం చెయ్య గలడు? మా నాన్నగార్కి డబ్బు కర్చు అంటే కళ్లు తిరిగి కాళ్ళు తేలినంత పని అవుతుంది. అమ్మ ద్వారా అడుగుదామంటే ఆమె గౌరవం ఏనాడో అంతరించింది. పోనీ వాడు చేసే ఖర్చు కాస్త తగ్గించి నాలుగు నెలలు కూడ పెడితే రేడియో కొనుక్కోవచ్చు ఇంకోవస్తువా కొనవచ్చు. కాని నాన్న యిచ్చేదిగాక అమ్మదగ్గర మాయమాటలు చెప్పి తీసుకొనే డబ్బు చాలక కాఫీ హోటలులో అప్పుగూడా పెడతాడు. మా పెద్దమ్మ కొడుకు రాజా రేడియో కొన్న దగ్గరనుంచి వీడికోర్కె యింకా ఎక్కువయ్యింది. ధైర్యంచేసి రాత్రిపూట భోజనాలదగ్గర నాన్నని అతినెమ్మదిగా రేడియో కొనండి నాన్నా పెద్దమ్మగారింట్లో గూడా రేడియో కొన్నారు అన్నాడు. యీ మాట విన్న నాన్నగార్కి అరికాలి మంట నెత్తికి తన్నింది. ఔరా చమటోడ్చి సంపాదించిన నాసొమ్ము విలాస వినోదాలకు వినియోగమా కల్ల. నేను బ్రతికి ఉండగా రేడియో ఇంట్లోకి కొనను. ఊరికే వచ్చినా రానీయను అని ఖచ్చితంగా పాండవోద్యోగ విజయాల్లో దుర్యోధనుడి పోజులో స్పీచ్ యిచ్చారు. పాపం అయ్యగారి జప సత్వాలు పూర్తయ్యాయి. రెండోరోజు భోజనానంతరం నాగదిలోకి తాంబూలపళ్ళెం తీసుకొని వెళ్ళే సరికి మావారు నా సోదరుడు కృష్ణార్జునుల్లాగ కూర్చుండి ఏదో ఆలోచనా సాగరంలో మునిగి తేలుచున్నారు. నన్ను చూచి యిరువురూ చిరునవ్వులు వలకబోయుచు పళ్ళెం అక్కడ పెట్టి దయచెయ్యమన్నారు.

ఇంతలో అమ్మపిలుపువిని వంటింట్లోకి వెళ్ళా.

సాయంత్రం ఆరుగంటలు అవ్వొస్తూంది. మా తమ్ముడు ఎక్కడినుంచోవచ్చి క్యాంప్ సూట్ లో వాడి షర్ట్సు ప్యాంట్సు తదితరాల్నీ సర్దుతున్నాడు. అమ్మ వీడిప్రయాణసన్నాహం చూచి ఎక్కడికిరా నాయనా అని అడుగుతూవుంది. నా యిష్టమొచ్చిన చోటికి పోతున్నా అంటూ పెట్టెసర్దుతున్నాడు. వీడు ఎక్కడికీ యీనాటి వరకు ప్రయాణం చేయలేదు. అదీగాక గారాబాల పుత్రుడు. వీడిచేష్టలు చూసేసరికి అమ్మకి భయం వేసింది. అందులో అమ్మ అసలే పిరికిది.

పక్కింటి అవధానికొడుకు శాస్త్రిగాడితో నాన్నగారి ఆఫీసుకు కబురంపింది.

నాన్నారు తక్షణం ప్రత్యక్షమయ్యారు. యీ గొడవంతా నాన్నచెవులార విని కండ్లార చూస్తూ ఎక్కడికో చెప్పరా బావగూడా యివ్వాళ ఆఫీసుకు వెళ్ళలేదు శలవులట. ఆయనగూడా వస్తారు అని చిన్నపిల్లల మాటలు మొదలెట్టారు. నాయిష్టం వచ్చినచోటికి పోతా. యీ యింట్లో నాకు అధికారం లేదు అంటాడేకాని ఫలానా ప్రదేశానికి అని అనడు. యీ గొడవంతా చూస్తున్న నాకు కోపంవచ్చి వెళ్ళేవాడవు చెప్పి వెళ్ళితే ఏంపోయింది అని ఘర్జించే సరికి గోవా సత్యాగ్రహానికి అని దేశనాయకుడిలా వినాయకుడి పోజు పెట్టాడు వెధవ. ఆకాశాన్నుండి ఊడిపడ్డట్లు మావారు ఏదో వార్తాపత్రిక చేతబూని అంతా యిక్కడే ఉన్నారే! విన్నారా గోవాలో 30 మంది సత్యాగ్రహులు మృతి బుడతకీచులు సత్యాగ్రహుల్ని నానా హింసాకాండలు చేస్తున్నారట అంటూ చావుకబురు చల్లగా తెచ్చారు. ఈ వార్త విన్న అమ్మకు మూర్ఛ వచ్చినంత పని అయింది. నాన్నగారి నెత్తిన అమెరికన్ యాటం పడ్డట్లనిపించింది.

అందరికీ వందనాలుఅంటూ పెట్టె చేతపట్టాడు ముద్దుల తమ్ముడు. నాన్నగారికి కూడా భయం జాస్తీ అయింది. అదీగాక ఒక్క కొడుకు పదివేల కట్నం రాబోతూవుంది రేపోమాపో. అయినా మన

కెందుకురా సత్యాగ్రహాలు అని బోధించడం ప్రారంభించారు నాన్న. ససేమిరా వింటేనా వెళతానని ఒక అడుగు ముందువేసాడు. నాన్న మైండ్ ఆఫ్ సెంట్. బోడీ ప్రజంట్. ఏమండోయి అల్లుడుగారు, మీరైనా కాస్త అని ఆ పని మా ఆయనగార్కి పురమాయించారు నాన్న.

వాడి బెట్టు ఒక మెట్టు ఎక్కింది. మావారు వాణ్ని చెయ్యిపట్టుకుని కల్పిత ప్రేమతో రావోయ్ బావా అంటూ గదిలోకి తీసుకువెళ్ళారు. నాన్నా అమ్మా నూటొక్క దేముళ్ళకి దండాలు అర్పించారు. మావారు గదిలోంచి వచ్చి వినేటట్లు లేదు వెధవ అన్నారు. మా నాన్నగార్కి జ్ఞాపక శక్తి ఎక్కువలెండి. ఆ పక్కగదిలోకి ఈయన ఆయన వెళ్ళి ఏ మాలోచించారో ఏమో మా తమ్ముణ్ణిపిలిచి రాత్రి భోజనాలదగ్గర అడిగింది కొంటాను ప్రయాణం మానమన్నారు. దాంతో మా తమ్ముడు మౌనం అర్ధాఅంగీకారం అన్నట్లునుంచున్నాడు. రెండోరోజు మధ్యాహ్నం మా యింట్లో రేడియో వెలిసింది.

ఈ గొడవ అంతా చూస్తుంటే మా ఆయనగారి మీద నాకు కొద్దిగా అనుమానం కలిగింది. దాయడం ఎందుకూ వార్ని అడిగాను.

ఈ పదకం మా శ్రీ వారే వేసారట మా వాడి బాధ చూడలేక. వాడి కోర్కె ఫలించింది.

గోవాలాంటి మరో సత్యాగ్రహం ఏదైనా వస్తే మా యింట్లో మరో వస్తువు వస్తుంది—

గేయం

# స్వాధీన పతిక

శశాంక

మనసాయెనే స్వామికి
చే జేతుల సింగారమును సేయ
మనసాయె నా స్వామికి
కదలి ముత్తెపుకోవకై సేసి కంఠమున
చదలిచుక్కల పేరె సమకూర్పగళమందు
మనసాయె నా స్వామికి
చే జేతుల సింగారమును సేయ
మనసాయె నా స్వామికి
జడనిండ వలపుటలరులనలరించి
ఒడలెల్లవలపుటలల నగలుంచగ
మనసాయెనా స్వామికి
చే జేతుల సింగారమునుసేయ
మనసాయెనే స్వామికి
కనులకాటుకరేక కోరికదీరిచి
చెక్కిలికెమ్మోవి ముద్రల నుంచగ
మనసాయెనే స్వామికి
చే జేతుల సింగారమును సేయ
మనసాయెనా స్వామికి
పునుగు జవ్వాదుల పులిమి నా మెయినిండ
కస్తూరినలది తా కౌగిట గదియింప
మనసాయెనే స్వామికి
చే జేతుల సింగారమును సేయ
మనసాయె నా స్వామికి